క్లుప్తంగా

అమ్మవార్లను దర్శించుకున్న అధికారులు



పూజలు చేస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: సీసీసీలోని ముక్కిడి పోచమ్మ వద్ద గల సమ్మక్క సారలమ్మలను సింగరేణి అధికారులు దర్శించుకున్నారు. ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి ఉన్నతాధికారులతో కలిసి సమ్మక్క సారలమ్మకు గద్దెల వద్ద శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సింగరేణి ఉద్యోగులు సుఖ సంతోషాలతో ఉండాలని, అమ్మవార్లను మొక్కుకున్నట్లు ఆయన తెలి పారు. కార్యక్రమంలో ఎస్ఓటుజీఎం కే.రవికుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ (పర్సనల్) అరవిందరావు, ఏజెంట్ రాముడు, సెక్యూరిటీ అధికారి మురళీమోహన్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కాంతారావు, ఆలయ పూజారి రమేష్ పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



కిషన్‌రెడ్డితో పార్టీలో చేరిన నాయకులు

దండేపల్లి: రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు మోటపల్కుల గురువయ్య, దండేపల్లి మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్, మాజీ జెడ్పీటీసీ మంద రాజయ్య, మాజీ వైస్ ఎంపీపీ చిట్ల శ్రీనివాస్‌తో పాటు మరి కొంతమంది శుక్రవారం రాత్రి బీజేపీలో చేరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి మంచిర్యాలలో కేంద్ర మంత్రి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కిషన్ రెడ్డి కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

భీమారం: మండలంలోని పోలంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద శనివారం పంటల సాగుపై జగిత్యాలలోని పొలాస వ్యవసాయ కలాశాల విద్యార్థులు రైతులకు వివిధ పద్ధతుల్లో అవగాహన కల్పించారు. వేయాల్సిన పంటల కోసం ముందే వ్యవసాయశాఖను సంప్రదిస్తే తగు సూచనలు చేస్తారని తెలిపారు. నీటి లభ్యత బట్టి పంటల రకాలు ఎంపిక చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త శివకృష్ణ, విద్యార్థులు అక్బర్‌ఖాన్, బి.మనోజ్, విశాల్, ప్రణయ్, ఏఈవో అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న జోబిన్

మంచిర్యాలఅర్బన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అండర్–14 క్రికెట్ టోర్నమెంట్ 67వ రాష్ట్ర స్థాయి పోటీలకు శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. డిసెంబర్ 15నిర్మల్‌లో నిర్వహించిన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. విశ్వతేజ్, అర్జున్‌లు ఈ నెల 26నుంచి 29వరకు జడ్చర్ల మినీ స్టేడియంలో నిర్వహించే టోర్నమెంట్‌లో పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు జోబిన్, పీఈటీలు రాజేందర్, విలాస్‌కుమార్, అక్షయ్, అనూష అభినందించారు.

చికిత్సపొందుతూ ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

జన్నారం: మండలంలోని మురిమడుగు ఫీల్డ్ అసిస్టెంట్ కుటికెల రాములు(52) అనారోగ్యం భారిన పడి మృతి చెందాడు. నాలుగు రోజుల క్రితం రాములు హైబీపీతో పడిపోగా, వెంటనే ఆయన్ను కుటుంబ సభ్యులు జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారు జామున ఆసుపత్రిలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య విజయ, కూతురు ఉన్నారు. ఫీల్డ్‌అసిస్టెంట్‌గా ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా మంచిపేరు తెచ్చుకున్నాడు. ఆయన మృతికి ఉపాధి హామీ సిబ్బంది సంతాపం తెలిపారు.

మార్కెట్ చైర్మన్ పదవికి పోటీ..!

- బరిలో రెండు మండలాల నాయకులు



లక్సెట్టిపేట మార్కెట్ కమిటీ కార్యాలయం

లక్సెట్టిపేట: గత ప్రభుత్వ హయాంలో నియమించిన మార్కెట్ కమిటీ చైర్మన్‌ల పదవులు ముగిసిపోగా, ప్రభుత్వం మారడంతో నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ కుర్చీ కోసం పలువురు మంతనాలు జరుపుతున్నారు. రెండు సంవత్సరాల కాలం పాటు ఉండే చైర్మన్ పదవి కోసం రెండు మండలాల నాయకులు పోటీ పడుతున్నారు. ఇప్పటి వరకు పార్టీ కోసం కృషి చేసిన వారికి ఇస్తారా, లేక కొత్త నాయకులకు ఇస్తారా అనేది సంశయాత్మకంగా ఉంది.

రెండు మండలాల నుంచి...

లక్సెట్టిపేట, దండేపల్లి రెండు మండలాలకు ఒకటే మార్కెట్ కమిటీ కార్యాలయం ఉండడంతో పోటీ తీవ్రత ఎక్కువగా ఉంది. ఇప్పటి వరకు చైర్మన్‌గా లక్సెట్టిపేట, వైస్ చైర్మన్‌గా దండేపల్లి నుంచి మాత్రమే నియామకం జరిగింది. ప్రస్తుతం చైర్మన్ దండేపల్లికి, వైస్ లక్సెట్టిపేటకు ఇవ్వాలని దండేపల్లి వాసులు తీవ్రంగా కోరుతున్నట్లు తెలుస్తోంది.

పేర్లు ఖరారేనా...?

రెండు మండలాల నుంచి చైర్మన్, వైస్ చైర్మన్‌ల పేర్లను అధిష్టానానికి పంపినట్లు రహస్యంగా తెలుస్తోంది. ప్రస్తుతం చైర్మన్ ఎస్సీ రిజర్వేషన్ కావడంతో దండేపల్లి మండలం ధర్మరావుపేటకు చెందిన ప్రేంచంద్, వైస్ చైర్మన్‌గా పట్టణానికి చెందిన పట్టణాధ్యక్షులు ఎండీ ఆరీఫ్‌ల పేర్లను ప్రకటించినట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. వీరి యొక్క పేర్లను అధిష్టానానికి పంపించగా, చివరి జాబితా విడుదల కోసం ఎదురుచూస్తున్నారు. గత పాలకుల కంటే నూతన పాలకుల హయాంలో రైతులకు న్యాయం జరగాలని పలువురు కోరుకుంటున్నారు.

కదిలిన అధికార యంత్రాంగం



లైన్‌గడ్డలో చెత్త తొలగిస్తూ...



చెన్నూర్ పద్మశాలివాడలో...

- కాలనీలలో చెత్త తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

చెన్నూర్: మున్సిపాలిటీలో ప్రధాన రోడ్లు శుభ్రం చేసి వార్డులను వదిలేస్తున్నారు. వార్డులలో నెలకొన్న పారిశుధ్య లోపం పై 'చెత్త శుద్ధి కరువు' అనే శీర్షికన శనివారం కథనం ప్రచురితమైంది. 'సాక్షి' కథనానికి అధికార యంత్రాంగం కదిలింది. కాలనీలలో పేరుకుపోయిన చెత్తా, ముళ్ల కంపలను తొలగించారు. ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి లైన్‌గడ్డ, పద్మశాలీవాడ, బ్రాహ్మణవాడలలో చెత్తను తొలగించామని మున్సిపల్ కమిషనర్ గంగాధర్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్స్‌స్పెక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. వారం రోజుల పాటు అన్ని వార్డులలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

హుండీ లెక్కింపు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల గోదావరి తీరంలో నిర్వహించిన శ్రీ సమ్మక్క–సారలమ్మ జాతర సందర్భంగా వచ్చిన ఆదాయాన్ని శనివారం జాతర నిర్వాహకులు లెక్కించారు. సమ్మక్క వద్ద హుండీ ఆదాయం రూ.71,871, సారలమ్మ హుండీ ఆదాయం రూ.59,348, పగిడిద్దరాజు వద్ద రూ.8383, గోవిందరాజు వద్ద రూ.8395, జంపన్న వద్ద రూ.1804, మైకులద్వారా రూ.34615, ఆదాయం సమకూరింది. దీంతో జాతర మొత్తం ఆదాయం రూ.1,84,416 ఆదాయం వచ్చినట్లు ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. దేవతలు వన ప్రవేశం చేయడంతో జాతర ముగిసింది.



పవర్‌కట్ ప్రాంతాలు



మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని ఏసీసీ సబ్‌స్టేషన్ పరిధిలో 33కేవీ లైన్ మరమ్మతుల కారణంగా ఆదివారం టౌన్–2, టౌన్–3 ఏరియా పలుకాలనీల్లో సరఫరాలో నిలిపివేయనున్నట్లు ఏడీఈ రేణుగుంటస్వామి ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఏసీసీ సబ్‌స్టేషన్, రాజీవ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో గల పలుకాలనీల్లో సరఫరాకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

బదిలీపై వెళ్తున్న అధికారులకు సన్మానం



ఎస్ఓటు జీఎంను సన్మానిస్తున్న జీఎం, అధికారులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేసి పదోన్నతులు పొంది ఇతర ఏరియాలకు బదిలీపై వెళ్తున్న అధికారులను ఏరియా అధికారులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఏరియా ఎస్ఓటు జీఎంగా పనిచేసి రామగుండం రీజినల్ సేఫ్టీ జనరల్ మేనేజర్‌గా బదిలీ అయిన రఘుకుమార్‌ను, ఆర్కే 7గని మేనేజర్‌గా పనిచేసి ఆర్జీ 1 ఏరియాకు క్వాలిటీ ఇన్‌చార్జిగా వెళ్తున్న సాయి ప్రసాద్‌లను శనివారం జీఎం కార్యాలయంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. వారిని ఏరియా జీఎం సంజీవరెడ్డి శాలువాతో సత్కరించి వారు చేసిన సేవలను కొనియాడారు. బదిలీపై వెళ్తున్న ఏరియాలో కూడా మంచి పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్, డీజీఎం (పర్సనల్) అరవిందరావు, చిరంజీవిలు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్ రావు, ఏజెంట్లు ఏవీ రెడ్డి, గోపాల్ సింగ్, క్వాలిటీ ఇంచార్జీ వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా ప్రత్యేక గ్రామసభ



తాండూర్: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ ఆవరణలో శనివారం నిర్వహించిన ప్రత్యేక గ్రామసభ రసాభాసగా మారింది. స్థానిక నాయకులు కొందరు ఇటీవల హైదరాబాద్‌లోని ప్రజావాణిలో తాండూర్ ఐబీ ప్రాంతాన్ని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తాండూర్ ఐబీ, సుభద్ర కాలనీ, మసీద్‌వాడకు చెందిన స్థానికులు తాండూర్ ఐబీ ప్రాంతాన్ని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని విన్నవించగా, తాండూర్ గ్రామస్తులు తాండూర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా చేయాలని తమ వాదన వినిపించారు. ఈ సమయంలో ఇరువర్గాలకు, అధికారులకు స్థానికులకు మధ్య కొంత వాగ్వివాదం చోటు చేసుకుంది. అధికారులు ఇరువర్గాల వారిని సముదాయించి శాంతింపజేశారు. తాండూర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా చేయాలని 27దరఖాస్తులు రాగా, తాండూర్ ఐబీ ప్రాంతాన్ని నూతన గ్రామ పంచాయతీగా చేయాలని ఒక దరఖాస్తు వచ్చింది. గ్రామసభలో తమ దృష్టికి వచ్చిన అంశాలను ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తామని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సిరంగి శంకర్, ఎంపీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి తపాస్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివజయంతి పతాకావిష్కరణ



పతాకావిష్కరణ చేస్తున్న బ్రహ్మకుమారి శీలా

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీ కాలనీలో శనివారం ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నూతన భవన గృహ ప్రవేశం చేసిన అనంతరం శివజయంతి పతాకావిష్కరణను హైదరాబాద్ నుంచి విచ్చేసిన ముఖ్య అతిథి రాజయోగిని బ్రహ్మకుమారి శీలా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజయోగ సేవ కేంద్రం ద్వారా మంచిర్యాల ప్రాంత వాసులకు ఆధ్యాత్మిక రహస్యాలు, మనసు ప్రశాంతత చేకూరి ఒత్తిడి నుంచి దూరంగా ఉండేందుకు ఏకాగ్రతపై శిక్షణ తరగతులను ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పతాకావిష్కరణలో ఆసిఫాబాద్ జడ్జి రమేశ్, మంచిర్యాల జడ్జి సంపత్, వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో కార్మికుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

శ్రీరాంపూర్: పంజాబ్‌లో రైతులపై హర్యానా పోలీసులు కాల్పులు జరిపిన ఘటనకు నిరసనగా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. సివిల్ డిపార్టుమెంట్‌లోని కాంట్రాక్ట్ కార్మికులు శ్రీరాంపూర్ సివిల్ వర్క్‌ల వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం మాట్లాడుతూ.. శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్న రైతులపై రబ్బర్ బుల్లెట్లతో పోలీసులు కాల్పులు జరపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రైతులను గోస పెట్టిన ఏ ప్రభుత్వమైనా కాలగర్భంలో కలువడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు అప్పారావు, శంకర్, సుధాకర్, రాజేష్, రాంబాబు, శారద, కవిత పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు



విద్యార్థులకు సూచనలు చేస్తున్న డాక్టర్ సమత

నస్పూర్: పరీక్షలు సమీపిస్తున్న వేళ విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ సమత తెలిపారు. తీహల్‌పహడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఆమె విద్యార్థులకు ఒత్తిడిపై అవగాహన సదస్సు నిర్వహించారు. త్వరలో వార్షిక పరీక్షలు ప్రారంభం అవుతున్న దృష్ట్యా విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా పరీక్షలకు హాజరుకావాలని సూచించారు. ముందే లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రణాళిక బద్ధంగా పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రామన్న, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

26న విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

కాసిపేట: మండల కేంద్రంలోని రైతువేదికలో ఈ నెల 26న పదో తరగతి విద్యార్థులకు అవగాహన, ప్రేరణ కార్యక్రమం కలెక్టర్ ఆదేశానుసారం నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి ప్రభాకర్ రావు తెలిపారు. జిల్లా పరిషత్ పాఠశాలలు, కేజీబీవీ, మోడల్‌స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులను పరీక్షప్యాడ్‌లు, పెన్ను, నోట్‌బుక్కు, వాటర్‌బాటిల్‌తో సమయానికి ఉపాధ్యాయులు తీసుకురావాల్సిందిగా తెలిపారు. అదనపు కలెక్టర్ హాజరయ్యే ఈ కార్యక్రమం వందశాతం ఉత్తీర్ణత, అత్యధిక జీపీఏ సాధన లక్ష్యంగా నిర్వహించనున్నట్లు, సైకలాజిస్ట్, సబ్జెక్టు నిపుణులు టైం మేనేజ్‌మెంట్, పరీక్షపత్రంపై అవగాహన, పరీక్షలపై భయం పోగొట్టడం పలు అంశాలపై విద్యార్థులకు వివరించనున్నట్లు తెలిపారు. బాలికలు ఉన్న పాఠశాలల ఉపాధ్యాయులు మహిళా ఉపాధ్యాయులను వెంట పంపించాల్సిందిగా కోరారు.

సీసీ రోడ్డు వేశారు.. సైడ్‌బర్మ్ మరిచారు



భీమారం: మండలంలోని ఎలకేశ్వరం గ్రామంలో ఆరు నెలల క్రితం సీసీ రోడ్డు నిర్మించిన అధికారులు, రోడ్డుకి ఇరువైపులా మట్టి వేయకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సీసీ రోడ్డుపై ఎదురెదురుగా వాహనాలు వస్తే రోడ్డు దిగలేని పరిస్థితి నెలకొంది. ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి వేసి ప్రమాదాలు జరుగకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మహనీయుల విగ్రహాలకు రక్షణ కల్పించాలి



ఐక్యత చాటుతున్న బహుజన సంఘాల నాయకులు

పాతమంచిర్యాల: మహనీయుల విగ్రహాలకు రక్షణ కల్పించాలని దళిత బహుజన సంఘాల నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలో బహుజన సంఘాల నాయకుల శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కోటపల్లి మండలం బోరంపల్లిలో మూడు రోజుల క్రితం మహాత్మాజ్యోతిభాపూలే విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారని, నింధితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ ఘటనలో భాగస్వాములైన ఆధిపత్య వర్గాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. బహుజన మహనీయులు విగ్రహాల రక్షణ వారి సంస్కృతి ప్రచారం కోసం జిల్లాలో ఐక్య కార్యాచరణ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో బహుజన ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ పలిగిరి కనకరాజు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మోహన్, రైతు సంఘం జిల్లా నాయకులు సంకె రవి, సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం, నేతకాని సంఘం నాయకులు దుర్గం ఎల్లయ్య, బీఎస్పీ నాయకురాలు భవానీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్, ఐఎఫ్‌టీయూ నాయకులు గోమాస ప్రకాష్, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు వచ్చాకే పనులు చేపట్టాలి



పనులు పరిశీలిస్తున్న ఎంపీవో అనిల్

జైపూర్: మండలంలోని రామారావుపేట శివారులో అనుమతులు లేకుండా రైస్‌మిల్లు నిర్మిస్తున్నారని వచ్చిన ఫిర్యాదులపై శనివారం ఎంపీవో అనిల్‌కుమార్ విచారించారు. ఈ సందర్భంగా రామారావుపేట శివారులో నర్సింగాపూర్ గ్రామానికి చెందిన తాటిపల్లి శ్రీనివాస్ రైస్ మిల్లు నిర్మాణంలో భాగంగా ప్రహరీ, పిల్లర్లను నిర్మించినట్లు అన్నిరకాలు అనుమతులు పొందాకనే నిర్మాణం చేపట్టాలని సూచించారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్ట గ్రామంలోని రుష్యమూక పర్వతంపై మాఘశుద్ధ పౌర్ణమి సందర్భంగా శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేళాతాళాలతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. సుమారు వేయి మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు.

అలరించిన విద్యార్థుల ఆటాపాట





మంచిర్యాలఅర్బన్: తెలంగాణ మోడల్‌స్కూల్ మంచిర్యాలలో విద్యార్థుల ఆటపాటలు అలరించాయి. పాఠశాలలో పదోవతరగతి విద్యార్థులకు తొమ్మిదో తరగతి విద్యార్థులు శనివారం ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఇదే స్కూల్లో చదువుపూర్తి చేసుకుంటున్న విద్యార్థులు అనుభవాలు, జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రజిని మాట్లాడుతూ.. టెన్త్ పరీక్షల్లో భయం వీడి పది జీపీఏ సాధించాలని సూచించారు.

కాసిపేట మోడల్‌స్కూల్‌లో...

కాసిపేట: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్‌స్కూల్ అండ్ కాలేజీలో శనివారం ఇంటర్ విద్యార్థులు ఫేర్‌వెల్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో సత్యనారాయణ సింగ్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు సమాజంపై అవగాహన కలిగి ఉండాలని, చెడు వ్యసనాలవైపు మళ్లకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పిన మాటలు ఆచరిస్తూ ముందుకు సాగాలన్నారు. ప్రతి విద్యార్థి జీవితంలో స్థిరపడేందుకు లక్ష్యాన్ని ఎంచుకొని లక్ష్య సాధనకు శ్రమించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు అందరినీ అలరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య, ఎంపీవో నాగరాజు, ఉపాధ్యాయులు మోహన్, ఎస్ఎంసీ సభ్యులు కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రోగులకు పండ్లు పంపిణీ

చెన్నూర్: పట్టణంతో అయ్యప్ప స్వామి ఆలయంలో గర్మిళ్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో పలువురిని రేకుర్తి కంటి ఆసుపత్రికి రెఫర్ చేయగా, 29మంది ఆపరేషన్ చేయించుకుని వచ్చారు. కాగా వారికి అయ్యప్ప సేవ సమితి సభ్యులు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గర్మిళ్ల లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెంకటేశ్వర్, సేవ సమితి సభ్యులు కారెంగుల రామయ్య, జాడి తిరుపతి, రమేశ్, గర్రెపల్లి నర్సయ్య పాల్గొన్నారు.